సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 6 । నవంబర్ । 2023



ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది. 8లో



ముగిసిన తైక్వాండో ఎంపికలు
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సారథ్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తైక్వాండో పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. 8లో



ఆయుర్వేదంతో ఆరోగ్యం
ఆయుర్వేదం సర్వరోగ నివారిణి అని కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన



సీపీ రవిశంకర్‌కు మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లు వివరిస్తున్న ఏసీఏ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో భాగంగా ఈ నెల 23న విశాఖలో జరగనున్న మ్యాచ్‌కు సంబంధించి స్టేడియంలో భద్రత ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి, కోశాధికారి ఎ.వి.చలం ఆదివారం పరిశీలించారు. స్టేడియం వెలుపల, లోపల, ఆటగాళ్ల ప్రవేశ ద్వారాలు, పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతాలను పరిశీలించి సూచనలు చేశారు. మ్యాచ్ నిర్వహణలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఆటగాళ్లతో పాటు అభిమానుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు.

ఏయూలో కొనసాగుతున్న నాక్ పర్యటన



గ్రంథాలయంలో తాళపత్రాలు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాక్ కమిటీ పర్యటన విజయవంతంగా సాగుతోంది. రెండవ రోజైన ఆదివారం కమిటీ సభ్యులు మూడు బృందాలుగా విడిపోయి వర్సిటీ మొత్తం కలియతిరిగారు. ఫార్మసీ కళాశాల తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతి గృహాలు, వైద్య కేంద్రం, క్రీడా విభాగం, సంగీత–నృత్య విభాగాలు, థియేటల్ ఆర్ట్స్, జపాన్ ఇన్ఫర్మేషన్ సెంటర్, సెయింట్ లూక్స్ ఆడియో, ఇంజినీరింగ్ విభాగం, న్యాయ కళాశాల, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ తదితర విభాగాలను సందర్శించారు. మధ్యాహ్నం విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు, వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఎన్ఎస్ఎస్, సంగీత, క్రీడా విభాగాలను సందర్శించిన కమిటీ సభ్యులు విద్యార్థుల ప్రగతి, పతకాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ వీడియో రికార్డింగ్ స్టూడియో వసతులు చూసిన సభ్యులు అచ్చెరువొందారు.

స్పాలపై పోలీస్ దాడులు

అరిలోవ : నగరంలో స్పాలపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 21 స్పాలలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా స్పాలను నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌లో ఒక స్పాలో జరిగిన వ్యవహారం అక్కడ తీవ్ర దుమారం లేపుతోంది. ఈ నేపథ్యంలో విశాఖలో స్పాలు, మసాజ్ సెంటర్లను తనిఖీ చేయాలని సీపీ ఎ.రవిశంకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో విశాఖలోని 21 స్పాలలో పోలీసులు దాడులు చేశారు. ఇందులో కొన్నింట్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రెండు స్పాలలో క్రాస్ మసాజ్‌లు కూడా జరుగుతున్నట్లు పోలీసుల పరిశీలనలో వెల్లడైనట్లు తెలిసింది. ఏయే స్పాలలో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయో.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నారు. ఈ తనిఖీలకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులు సోమవారం వెల్లడించే అవకాశం ఉంది. ద్వారకానగర్, త్రీ టౌన్, ఎంవీపీ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

కడలి హోరు.. పరుగు జోరు

- ఉత్సాహంగా వైజాగ్ నేవీ మారథాన్
- కిక్కిరిసిన సాగరతీరం





మారథాన్‌లో పాల్గొన్న అథ్లెట్లు, నేవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు కడలి అలల హోరు.. మరోవైపు పరుగు వీరుల జోరుతో విశాఖ సాగరతీరంలో పండగ వాతావరణం నెలకొంది. లేలేత సూర్యుని కిరణాలు పలకరిస్తుండగా వేలాది మంది యువత, నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హుషారుగా పరుగు పెట్టారు. వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్‌లో భాగంగా ఐదు కిలోమీటర్ల ఫన్ విభాగంలో ఔత్సాహికులు సరదాగా పరుగు పెడితే.. మిగిలిన విభాగాల్లో అథ్లెట్లు విజయమే లక్ష్యంగా శ్రమించారు. ఒంపు సొంపులు తిరిగిన తీరం వెంట సాగిన పరుగు.. అథ్లెట్లకు ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. ఈ మారథాన్‌లో మారిషస్ అథ్లెట్లు, స్థానిక చిన్నారులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

విశాఖ సాగరతీరంలో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్ ఉత్సాహంగా జరిగింది. 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల రేస్‌తో పాటు ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగులో వేలాది మంది పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌ను తూర్పు నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హాఫ్ మారథాన్‌ను వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్, 10కె రన్‌ను సీపీ రవిశంకర్ ప్రారంభించారు. ద పార్క్ హోటల్ సర్కిల్ దరి వైఎస్సార్ విగ్రహం వద్ద మారథాన్ రేసులతో పాటు ఫన్ పరుగును అథ్లెట్లు, యువతీయువకులు ప్రారంభించారు. ఆర్.కె.బీచ్ మీదుగా నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద యూటర్న్ తీసుకున్నారు. కాళీమాత ఆలయం మీదుగా ఏడువేల మంది ఔత్సాహికులు పాల్గొన్న ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగు ఎంజీఎం పార్క్ వద్ద ముగిసింది. మిగిలిన మూడు కేటగిరీల్లో పరుగు ఐఎన్ఎస్ కళింగ వైపు సుందరమైన సాగరతీరం మీదుగా కొనసాగింది. 2,700 మంది పాల్గొన్న 10 కిలోమీటర్ల పరుగు తెన్నేటి పరుగు వద్ద యూటర్న్ తీసుకోగా హాఫ్ మారథాన్ పరుగు వీరులు రుషికొండ గాయత్రి కళాశాల దగ్గర యూ టర్న్ తీసుకున్నారు. పూర్తి మారథాన్‌లో పాల్గొన్న 500 మంది అథ్లెట్లు ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని చేపాలుప్పాడ దగ్గర యూటర్న్ తీసుకున్నారు.



మారథాన్‌లో మేము సైతం..



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల పరుగు

విజేతలు వీరే..

పురుషుల ఓపెన్ విభాగంలో శిఖంధర్ తడాఖే 2.30 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలవగా హాఫ్ మారథాన్‌ను దీపక్ కుంబార్ 1.06 గంటల్లో పూర్తి చేశారు. 10 కిలోమీటర్ల పరుగును సోను కుష్వా 31 నిమిషాల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. మహిళా విభాగంలో ఆశా 3.08 గంటల్లో పూర్తి చేయగా.. లిలియన్ రుట్టో హాఫ్ మారథాన్‌ను 1.20 గంటల్లో, 10 కిలోమీటర్ల పరుగును మేరీగ్రేస్ 44 నిమిషాల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు.

వీఎంఆర్డీఏ పార్క్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, నావికాదళ అధికారులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. డీహైడ్రేషన్, వైద్య శిబిరాలు, కన్వీనియన్స్ స్టేషన్లు, రన్నర్స్‌ను ఉత్సాహపరించేందుకు మార్గంలో వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.



మారథాన్‌లో పాల్గొన్న మారిషస్ అథ్లెట్ల బృందం



మారథాన్ విజేత శిఖందర్‌కు అవార్డు అందిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ పెంధార్కర్



10 కిలోమీటర్ల పరుగు విజేతకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



హాఫ్ మారథాన్ విజేత దీపక్ కుంబార్

నేడు గాజువాకలో సామాజిక సాధికార బస్సు యాత్ర

విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైవీ సుబ్బారెడ్డి పిలుపు



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం గాజువాక నియోజకవర్గంలో జరగనుంది. ఉదయం 12 గంటలకు గాజువాకలో గల టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడతారు. మిందిలో గల అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) ప్రారంభోత్సవం, అనంతరం బైక్ ర్యాలీగా బీసీ రోడ్డు జంక్షన్ మీదుగా యాత్ర సాగుతోంది. 3 గంటలకు పాత గాజువాకలో బహిరంగ సభ జరగనుంది. యాత్రలో మంత్రులతోపాటు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారు.

యాత్ర విజయవంతం చేయాలి: వైవీ
గాజువాకలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎ స్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివా రం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేశారో వివరించనున్నట్లు తెలిపారు.

ఒక్కొక్క థీమ్‌తో..

- ఆహ్లాదం, విజ్ఞానం పంచేలా పార్కుల అభివృద్ధి
- అదనపు హంగులతో సిద్ధం చేస్తున్న జీవీఎంసీ

విశాఖ అంటే మనందరికీ ఠక్కున గుర్తొచ్చేది బీచ్. కాస్త సేద తీరాలంటే.. ఆహ్లాదం కావాలంటే వెంటనే బీచ్‌లో వాలిపోతాం. ఇప్పుడు మరిన్ని ఆహ్లాదకర ప్రాంతాలను విశాఖ మహానగర పాలక సంస్థ సిద్ధం చేస్తోంది. ఒక వైపు కొత్త రోడ్లు, కూడళ్ల విస్తరణ పనులు సాగుతుండగా.. మరోవైపు కాలనీల్లో ప్రజలు సేద తీరేలా పార్కులను తీర్చిదిద్దుతోంది. సాధారణ పార్కులకు భిన్నంగా ఉండే థీమ్ పార్కులు ఏర్పాటు చేస్తోంది. ఈ పార్కులు ఆహ్లాదం, పచ్చదనం అందిస్తూనే సబ్జెక్ట్ థీమ్‌తో మన దృష్టిని కేంద్రీకరిస్తాయి.

– డాబాగార్డెన్స్



సీతమ్మధారలో ఆధునికీకరించిన పార్కు

విశాఖ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పలు చోట్ల థీమ్ పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. పార్కు అంటే రెండు బల్లలు.. మూడు మొక్కలు వేయడం కాదు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ప్రజలకు పూర్తి స్థాయిలో పార్కులు ఆహ్లాదం పంచగలగాలి. పర్యావరణానికి మేలు చేయాలి. చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులకు ఉపయోగపడాలి. వాకింగ్ ట్రాక్‌లు, యోగా కేంద్రాలు, ఓపెన్ థియేటర్లు, మెడిటేషన్ సెంటర్లు, ఓపెన్ జిమ్‌లు, క్యాంటీన్లు, మరుగుదొడ్లు ఇలా అన్నీ ఉండాలి. వినోదంతో పాటు విజ్ఞానం పంచాలి. ఇవన్నీ ఒకే చోట ఉండేలా థీమ్ పార్కులు ఏర్పాటు చేస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునికీకరిస్తోంది.

ఎక్కడెక్కడ అంటే..

- జోన్–2 పరిధిలో రూ.7.15 కోట్లతో నాలుగు థీమ్ పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. రూ.1.94 కోట్లతో జీవీఎంసీ థీమ్ పార్కు, షిప్‌యార్డ్ లేఅవుట్‌లో రూ.1.92 కోట్లతో యోగా అండ్ మెడిటేషన్ థీమ్ పార్కు, బక్కన్నపాలెం లచ్చిరాజు లేవుట్‌లో రూ.1.95 కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్కు, రూ.1.34 కోట్లతో పామ్ గార్డెన్స్ థీమ్ పార్కు పనులు 50 శాతం పైనే పూర్తయ్యాయి.
- జోన్–3 పరిధిలో రూ.2.65 కోట్లతో రెండు పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో రూ.1.53 కోట్లతో శివాజీ పార్కు ఆధునికీకరణ పనులు ప్రారంభించగా.. 90 శాతం మేర పూర్తయ్యాయి. ఎంవీపీ సెక్టార్–11లో రూ.1.12 కోట్లతో చేపడుతున్న థీమ్ పార్కు పనులు 85 శాతం మేర పూర్తయినట్లు అధికారులు తెలిపారు.
- జోన్–5బి పరిధి గుల్లలపాలెం పార్కును అభివృద్ధి చేస్తున్నారు. రూ.39.40 లక్షలతో చేపట్టిన గుల్లలపాలెం పార్కు పనులు 55 శాతం మేర పూర్తయ్యాయి.
- జోన్–8 పరిధి సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ థీమ్ పార్కు పనులు 60 శాతం పూర్తయ్యాయి. రూ.1.78 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు.



షిప్‌యార్డ్ లేఅవుట్‌లో సిద్ధమవుతున్న యోగా పార్కు

థీమ్ పార్కుల అభివృద్ధి ఇలా..

జోన్	పార్కులు	నిధులు
జోన్–2	4	రూ.7.15 కోట్లు
జోన్–3	2	రూ.2.65 కోట్లు
జోన్–5బి	1	రూ.39 లక్షలు
జోన్–8	1	రూ.1.78 కోట్లు



త్వరలోనే అందుబాటులోకి శివాజీ పార్కు



శివాజీ పార్కును అన్ని హంగులతో అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రవేశ ద్వారం ప్లాజా, ఫ్లోరింగ్, పార్కు లోపల సెంట్రల్ రౌండ్ ప్లాజా, ఫౌంటెన్లు, ఛత్రపతి శివాజీ విగ్రహంతో ఫౌంటెన్, ఓపెన్ హంపి థియేటర్, మరుగుదొడ్ల నిర్మాణం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, జిమ్, వాకింగ్ ట్రాక్, యోగా ఆవరణ, క్యాంటీన్‌తో పాటు సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించే విధంగా విద్యుత్ దీపాలు, రంగురంగుల పెయింటింగ్, చక్కటి గ్రాస్ ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

15 నాటికి శివాజీ పార్కు పనుల పూర్తి



జీవీఎంసీ పరిధిలో 16 ఎకరాల్లో ఉన్న అతి పెద్ద పార్కు శివాజీ పార్కు. ఇటీవలే ఇక్కడ జరుగుతున్న ఆధునికీకరణ పనులు పరిశీలించాం. పార్కును ఆహ్లాదకరంగా, చక్కని గ్రాస్, ఆధునిక విద్యుత దీపాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ఈ నెల 15 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. జీవీఎంసీ పరిధిలోని థీమ్ పార్కుల పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– సాయికాంత్ వర్మ, కమిషనర్, జీవీఎంసీ

రూ.11.97 లక్షలతో పార్కుల అభివృద్ధి



జీవీఎంసీ పరిధిలో అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే సగ శాతం పనులు పూర్తయ్యాయి. కోట్లాది రూపాయలతో జంక్షన్లు విస్తరిస్తున్నాం. విశాఖ నగర ప్రజలు, పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. పలు జోన్లలో రూ.11.97 లక్షలతో థీమ్ పార్కులను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నాం. ఆయా ప్రాంతాల్లో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. వీటిలో ప్రధానంగా శివాజీ పార్కును ఆధునీకరిస్తున్నాం. ఇక్కడ ప్రవేశ ద్వారం, ఫ్లోరింగ్, ఫౌంటెన్లు, ఛత్రపతి శివాజీ విగ్రహం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, జిమ్, వాకింగ్ ట్రాక్, యోగా ఆవరణ ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాం. జోన్–8లో స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. రానున్న రోజుల్లో అన్ని జోన్లలో పార్కులు అభివృద్ధి చేస్తాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి విడదల రజిని
- కప్పరాడ, చంద్రనగర్ యూపీహెచ్‌సీల ప్రారంభం
- అందుబాటులోకి గోపాలపట్నం సీహెచ్‌సీలో అదనపు భవనాలు



కప్పరాడలో యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో మేయర్ హరి వెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతంలో సుమారు రూ.1.25 కోట్లతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర మేయర్ హరివెంకట కుమారి, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, ఉపాధి, ఆరోగ్యం తదితర వాటిపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందే దిశగా కార్పొరేట్ ఆసుపత్రులను తలపించే విధంగా ఆరోగ్య కేంద్రాలు నిర్మించారని తెలిపారు.19 మంది వైద్య సిబ్బందితో వార్డు ప్రజలకు చేరువలో అర్బన్‌హెల్త్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వెస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డాక్టర్ సనపల రాజేంద్ర, డీఈఓ భరణికుమార్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్, చల్లా రజిని, అల్లు శంకరరావు, శశికళ, ఆళ్ల లీలావతి, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, రెయి వెంకటరమణ, రాష్ట్ర నాయకులు పేడాడ రమణికుమారి, రవికుమార్, కిరణ్‌రాజు, జిల్లా నాయకులు ఎం.లక్ష్మి, శివగణేష్ పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య రంగానికి ఏం చేశారో చెప్పండి?



గోపాలపట్నంలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని, మేయర్ హరి వెంకట కుమారి, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్

గోపాలపట్నం: టీడీపీ నాయకుడు లోకేష్ వైద్య, ఆరోగ్యంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి విడదల రజిని అన్నారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.5.50 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను, కొత్తపాలెం దరి చంద్రనగర్‌లో రూ.1.26 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో వైద్య, ఆరోగ్య రంగానికి ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. మూలన పడిన ఆసుపత్రుల్ని బాగు చేశారా? వాటి పరిస్థితిని మార్చారా అని నిలదీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వంటి గొప్ప కార్యక్రమంతో స్పెషలిస్టు వైద్యులచే గ్రామ స్థాయిలో ప్రజలకు వైద్యం అందించే ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. ఆయన పాలనలో ఆరోగ్యశ్రీని కూడా అనారోగ్యశ్రీగా మార్చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

డాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు తెలిపారు. ప్రతి రోజూ కవి సమ్మేళనాలు, గ్రంథ పాలకుల సదస్సు, మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

ఆయుర్వేదంతో ఆరోగ్యం

బీచ్‌రోడ్డు : ఆయుర్వేదం సర్వరోగ నివారిణి అని కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ డి.వెంకటేష్ తెలిపారు. ధన్వంతరి జయంతి సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్ వద్ద బీచ్‌రోడ్డులో రైడర్స్ ర్యాలీ నిర్వహించారు. సిరిపురం, జూపార్కు, మద్దిలపాలెం మీదుగా ఏయూ మైదానానికి ర్యాలీ చేరుకొంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ భారతీయులంతా ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విమ్స్‌లో 50 పడకలతో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. ఆయుష్ పూర్వ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వరరావు మాట్లాడుతూ కేజీహెచ్, మధురవాడ, ఆనందపురం, ఉక్కునగరం, గాజువాకలో ఆయుష్ క్లినిక్‌లు ఉన్నాయన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష పరిశోధక అధికారి ఏజేవీ సాయి ప్రసాద్, వరల్డ్ రైడర్ ధవళ భరద్వాజ్ పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు

విశాఖ విద్య: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం కూడా నిర్వహించిన ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఆదివారం నిర్వహించినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఫీజు బకాయిలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా ఓ కార్పొరేట్ స్కూల్‌పై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయని, ఇదే విషయమై జిల్లా విద్యాశాఖాధికారులకు ఫోన్ ద్వారా తక్షణ చర్యల నిమిత్తం మౌఖిక ఆదేశాలు ఇచ్చామన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురిచేసేలా వ్యవహరించే ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిందే అన్నారు. ఈ విషయంలో ఉదాసీనంగా ఉంటే, విద్యాశాఖాధికారులపై కూడా చర్యలు తీసుకునేలా కమిషన్ సిఫార్సు చేస్తుందన్నారు.

'న్యూస్‌పేపర్ ఎంప్లాయిస్' జాతీయ కార్యదర్శిగా ఆనంద్



మహారాణిపేట: అఖిల భారత న్యూస్‌పేపర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శిగా విశాఖ నుంచి పి.ఆనంద్(దూరదర్శన్) ఎన్నికయ్యారు. ఇటీవల ఈ ఫెడరేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సి.శ్రీధర్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రవీంద్ర ప్రసాద్, కోశాధికారిగా ఎస్.కె.పటాక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంపత్ డి.ఎన్నికైనట్లు ఆనంద్ తెలిపారు.

క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- శబరిమల, పంచారామాలకు ప్యాకేజీలు
- లంబసింగి, అరకు, ధారమఠంకు బస్సులు



డాబాగార్డెన్స్: శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, విశాఖపట్నం రీజియన్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 5, 6, 7 రోజుల ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించింది. అయ్యప్ప స్వాముల సేవలో విశేష అనుభవం కలిగిన సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం అందజేస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలతో పాటు నౌరంగపూర్, కోరాపుట్, జైపూర్ ప్రాంతాల నుంచి కూడా అయ్యప్ప భక్తుల కోసం అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులు నడపనుంది.

శబరిమలై ప్యాకేజీ వివరాలు

5 రోజుల యాత్ర: విజయవాడ, మేల్ మరవత్తూర్, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ.
ప్రయాణచార్జీ (ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.6,600, అల్ట్రా డీలక్స్ రూ.6,550

6 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,000, అల్ట్రా డీలక్స్ రూ.6,900

7 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

7 రోజుల యాత్ర: విజయవాడ, శ్రీకాళహస్తి, బెంగళూరు, మైసూరు, గురువాయూర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

రిజర్వేషన్ కోసం ముందస్తుగా https://www.apsrtconline.inలో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకా బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ సౌకర్యం ఉంది.
సంప్రదించాల్సిన నంబర్లు: 99592 25602, 73829 21540, 99592 25594, 91001 09731, 73829 14219, 9959 221199

పంచారామ క్షేత్ర దర్శిని

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసంకు విశేష ప్రాముఖ్యం ఉంది. లయకారుడైన ఆ పరమశివుడిని కార్తీక మాసంలో, అందులో సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు తొలగుతాయని ప్రతీతి. అందువల్ల ఈ ఏడాది కార్తీక మాసంలో ఐదు ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించుకునే భక్తుల కోసం ఆర్టీసీ పంచారామ క్షేత్ర దర్శినిని ప్రవేశపెట్టింది. కార్తీకమాసంలో వచ్చే ప్రతీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. మరుసటి రోజు సోమవారం ఉదయం అమరావతి(అమరేశ్వరుడు), భీమవరం(భీమేశ్వరుడు), పాలకొల్లు(క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం(భీమలింగేశ్వరుడు), సామర్లకోట(కుమార రామలింగేశ్వరుడు) దర్శనాలుంటాయి.

ఏఏ రోజుల్లో..
ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రాడీలక్స్ రూ.2050

లంబసింగి టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో తెల్లవారుజామున 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్ ఫాల్స్, మోదమాంబ గుడి(పాడేరు), కాఫీ తోటలు చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి ధారమఠంకు సర్వీసులు బయలుదేరుతాయి. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ(అనకాపల్లి) చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.650, ఎక్స్‌ప్రెస్ రూ.550

గోపూజకు టికెట్ల విక్రయం ప్రారంభం

- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : సింహగిరిపై శ్రీగోకులంలో ఆదివారం నుంచి గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో గతంలో గోపూజలు నిర్వహించేవారు. కొన్ని కారణాల వల్ల వాటిని నిలిపివేశారు. ఇటీవల దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసమూర్తి భక్తుల సౌకర్యార్థం గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో ఎనిమిది మేలు జాతి కపిల గోవులను ఉంచారు. అలాగే శ్రీగోకులం వద్దే టికెట్టు కౌంటరును కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులు రూ.50 టికెట్టు తీసుకుని గోపూజ నిర్వహించుకోవచ్చని ఈవో తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ తొలి టికెట్లు తీసుకోగా..వారిపేరిట అర్చకులు గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



గోవులకు అరటిపండ్లు, కొబ్బరిముక్కలు పెట్టవద్దంటూ ప్రచారం చేస్తున్న ఈవో

కార్యక్రమంలో ఆలయ ఏఈవో భ్రమరాంబ, అన్నదానం విభాగం ఏఈవో నరసింగరావు, ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరి, అధికారులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు...
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన గోవులకు దానా నిమిత్తం ఒక రోజుకు ఒక గోవుకు రూ.200 భక్తులు చెల్లించవచ్చని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో సుమారు 250 గోవులను పోషిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా గోవులకు అరటిపండ్లు, కొబ్బరిముక్కలు, ప్రసాదం, బియ్యం, అన్నం పెట్టకూడదని భక్తులకు తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. అలాగే సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు వెంటనే కొండదిగువ శ్రీకృష్ణాపురంలోని గోశాల, వేంకటేశ్వరస్వామి ఆలయం, వరహా పుష్కరిణి, భైరవ స్వామి ఆలయం, మాధవదార లను సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే స్వామివారి ఆలయంలో ప్రతీ స్వాతి నక్షత్రం రోజు జరిగే నృసింహ హోమం టికెట్లు ఇకపై ఆన్‌లైన్‌లో కూడా తీసుకునే వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 12న స్వాతినక్షత్రానికి సంబంధించి ఆన్‌లైన్‌లో టికెట్లు అందిస్తామన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 19వ తేదీన విశాఖపట్నంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.rakrhieducation.com)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత : ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం:

అవగాహన సదస్సు తేదీ:
నవంబర్ 19, 2023(ఆదివారం)

వేదిక:
డా. బి.ఆర్.అంబేద్కర్ భవన్, రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా, రామా టాకీస్ దగ్గర, శ్రీనగర్, విశాఖపట్నం.

సమయం:
ఉదయం 09.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

సీఎం వైఎస్ జగన్‌కు 'జర్నలిస్టుల వందనం'



'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ నినాదాలు చేస్తున్న విశాఖ జర్నలిస్టులు

సాక్షి, విశాఖపట్నం : ఏ ముఖ్యమంత్రీ తీసుకోని సాహసోపేత నిర్ణయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసేందుకు అడుగులు వెయ్యడం నిజంగా చారిత్రకమని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జర్నలిస్టులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విశాఖ జర్నలిస్టుల వందనం పేరుతో కృతజ్ఞతా పూర్వక ర్యాలీని ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించారు. సీ హారియర్ మ్యూజియం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి .జనార్ధన్, అధ్యక్షుడు బి.రవికాంత్, ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణతో పాటు విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.

7న వహీదా రెహమాన్ అభినందన సభ

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న విశాఖ పౌర గ్రంథాలయంలో దాదాసాహెబ్ ఫాల్కే జీవితకాల సాఫల్య పురస్కార గ్రహీత వహీదా రెహమాన్ అభినందన సభ ఏర్పాటు చేశామని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వహీదాకు విశాఖతో సంబంధం ఉందని, ఆమె తండ్రి మున్సిపల్ కమిషనర్‌గా ఇక్కడ పనిచేశారన్నారు. సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో ఆమె చదువుకున్నారన్నారు. ఆమెకు సంబంధించిన డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ప్రదర్శిస్తామన్నారు. అందరూ ఈ కార్యక్రమానికి ఆహ్వానితులేనని.. వివరాలకు 90324 77463కు సంప్రదించాలని సూచించారు.

ప్రాణం తీసిన వివాదం

- యువకుడు మృతి
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు



దాడికి పాల్పడిన వారి ఇంటి ముందు మృతదేహంతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



కరుణ్ కుమార్(ఫైల్)

గోపాలపట్నం : టాయిలెట్ వివాదం ఒక వ్యక్తి మృతికి దారి తీసింది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం ఆశవానిపాలెంలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడిన ఆలమూరి కరుణ్‌కుమార్ (28) స్నేహితులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయిభాను అనే యువకుడు ఆశవానిపాలెం శివారు ప్రాంతంలో టాయ్‌లెట్‌కు వెళ్లాడు. దీనిపై అక్కడున్న తవిటి రాజు, అతని భార్య రాజేశ్వరి, ఆమె తోటి కోడలు లక్ష్మి, రామారావు అతనితో గొడవకు దిగారు. మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. విషయం తెలుసుకుని కరుణ్‌కుమార్ వచ్చి గొడవకు కారణంపై ఆరా తీశాడు. దీంతో నీకేంటి సంబంధమంటూ తవిటి రాజు, రాజేశ్వరి, లక్ష్మి అతడిపై దాడికి పాల్పడ్డారు. కరుణ్‌కుమార్ గుండెలపై కొట్టడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మరో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో గ్రామానికి తీసుకువచ్చారు. దాడికి పాల్పడిన వారి ఇంటి ఎదుట మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందిన వెంటనే ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, కంచరపాలెం సీఐ నల్లి సాయి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నారు. మృతుడు కరుణ్‌కుమార్ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో కాంట్రాక్టర్ వద్దఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు, భార్య, తమ్ముడు ఉన్నారు. మూడేళ్ల క్రితం వివాహం అయింది.

బీసీలను గుర్తించే పార్టీలకే మద్దతు



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నేతలు

సీతంపేట: బీసీలను గుర్తించే పార్టీలకు పూర్తి మద్దతు అందిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కీలక నేతల సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని అనంతరం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 2024 ఎన్నికల్లో బీసీలను ఐక్యం చేసేందుకు రాష్ట్రంలో డిసెంబర్ 7వ తేదీ నుంచి రథయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్, మహిళాధ్యక్షురాలు నూకాలమ్మ, రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం మరో పోరాటానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 56శాతం ఉన్న బీసీలకు శాసనసభలో 90 సీట్లు, పార్లమెంట్‌లో 12 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని బీసీ అయినప్పటికీ బీసీలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా యువజన అధ్యక్షుడు వెంకటగిరి ఉదండరావ్, రాష్ట్ర కార్యదర్శి వారణాశిరావు అన్నాజీరావు, అనకాపల్లి శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు బంధం వెంకటరమణ, పిట్టా చంద్రపతిరావు, రాష్ట్ర ఎంబీసీ కులాల అధ్యక్షులు అనుచంద్ర ప్రసాద్, ఈశ్వరి, పద్మ, శారద, లక్ష్మి పాల్గొని సంఘీభావం తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ తైక్వాండో ఎంపికలు



పోటీలను ప్రారంభిస్తున్న పీడీలు అప్పలరాజు, రాములు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సారథ్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తైక్వాండో పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14 బాల, బాలికలు విభాగంలో 17మంది బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు విశాఖ పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.అప్పలరాజు చెప్పారు.

9 నుంచి అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర పోటీలు
ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-14, 17,19 విభాగాల్లో బాలురకు అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 9 నుంచి 11వరకు నిర్వహించనున్నారు. బాలికలు పోటీలు వెన్యూ, తేదీలు ఇంకా వెలువడాల్సి ఉంది.

విజేతలు వీరే:
బాల, బాలికలకు వేర్వేరుగా 11 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అయితే బాలికలకు 9 కేటగిరీలు, బాలురు 8 కేటగిరీల్లో మాత్రమే పోటీలకు హాజరయ్యారు. వీరంతా బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను నిర్వాహకులను అప్పలరాజు, పెంటకోట రాము, ఆనంద్ తదితరులు అభినందించారు.

బాలికలు:
16-18 కేజీలు విభాగంలో అచ్యుతాపురం కేజీబీవీ నుంచి జీ.వైష్ణవి, 20-22 కిలోల విభాగంలో మునగపాక కేజీబీవీ నుంచి సీహెచ్ కీర్తన, 22-24 కిలోల విభాగంలో మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎం. స్రవంతి, 24-26 కిలోల విభాగంలో బి. ధరణిప్రియ, 26-29 కిలోల విభాగంలో మధురవాడ భాష్యం స్కూలుకు చెందిన వై. ధనలక్ష్మి, 29-32 కిలోల విభాగంలో బోయిపాలెం శ్రీ ప్రకాశ్ స్కూలుకు చెందిన పి. జ్యోత్స్నశ్రీ, 32-35 కిలోల విభాగంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలుకు చెందిన కె. ధనలక్ష్మి, 35-38 కిలోల విభాగంలో మధురవాడ భాష్యం హైస్కూలుకు చెందిన ఫాతిమ ఉన్నీష, 38కిలో విభాగంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూలుకి చెందిన భాషిత విజేతలుగా నిలిచారు.

బాలురు విభాగంలో..
21-23 కిలోలు విభాగంలో మల్కాపురం సెయింట్ జోసెఫ్ స్కూలు నుంచి జె.తమన్, 25-27 కిలోల విభాగంలో గోపాలపట్నం నారాయణ టెక్నో స్కూలుకు చెందిన సుధీర్, 27-29 కిలోల విభాగంలో ఆరిలోవ ప్రియదర్శిని విద్యానికేతన్‌కు చెందిన వి. ధనుషా, 29-32 కిలోల విభాగంలో జ్ఞానాపురం మరియదాస్ స్కూల్‌నుంచి బి. రోహిత్‌కుమార్, 32-35 విభాగంలో బాలాజీ స్కూలుకు చెందిన ఎ.వెంకట ధనుష, 35-38 కిలోల విభాగంలో శ్రీ విష్ణు స్కూలుకు చెందిన చిద్విలాస, 38-41 కిలోల విభాగంలో గోపాలపట్నం జెడ్పీ హైస్కూలుకు చెందిన కె. వెంకటదుర్గ, 41కిలోలు విభాగంలో నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూలుకు చెందిన సుధీర్‌వర్మలు బంగారు పతకాలు సాధించారు.

బాక్సింగ్ విజేతలకు అభినందన



విజేతలతో మారిటైం బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి

సీతమ్మధార : బీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలో అక్టోబర్ 27 నుంచి 30 వరకు జరిగిన నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్స్ విభాగాల్లో ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ తరఫున పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించారు. వారిని సీతమ్మధారలోని కార్యాలయంలో మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో మన క్రీడాకారులు రెండో స్థానంలో నిలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ జట్టుకు 13 గోల్డ్ మెడల్స్, 12 సిల్వర్ మెడల్స్, 7 బ్రాంజ్ మెడల్స్ రావడం శుభపరిణామమన్నారు. భవిష్యత్‌లో జరిగే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కేవీఆర్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎస్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ అమ్మోరు, కోచ్‌లు, విశాఖ పోర్టు ట్రస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ గుర్ల చందు, మెడికల్ చీఫ్ సునీల్ పాల్గొన్నారు.